శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలి



**నెల్లూరు అర్బన్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** గ్రామ స్థాయిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల పథకాల కింద చేపడుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన ప్రణాళికా మరియు ఆర్థిక విషయాల పనుల విషయాలు, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య, వ్యవసాయ, స్త్రీ సంక్షేమ, సాంఘిక సంక్షేమ విషయాలు తదితర విషయాలపై సంఘ స్థాయి సమావేశాలు జరిగాయి. ఈ స్థాయి సంఘాల సమావేశాల్లో ఆయా శాఖల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను వివరించడంతో పాటు ఆయా కార్యక్రమాల ద్వారా చేపడుతున్న పనుల పురోగతిని సంబంధిత అధికారులు జెడ్పీ చైర్‌పర్సన్ ఆయా స్థాయి సంఘాల్లో సభ్యులుగా ఉన్న జెడ్పీటీసీ సభ్యులకు తెలియజేయడం జరిగింది. క్షేత్ర స్థాయిలో ఉన్న పలు సమస్యలను ఈ సందర్భంగా స్థాయి సంఘాల సభ్యులు జెడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి ఆమె స్పందిస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. తొలుత ప్రణాళికా మరియు ఆర్థిక విషయాలపై జరిగిన స్థాయి సంఘ సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను ఆ శాఖ ఎస్ఈ వివరిస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆయా గ్రామాల్లోనే సేవలు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాలను, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను, రైతు భరోసా కేంద్రాలను, వైఎస్ఆర్ డిజిటల్ లైబ్రరీలను, బల్క్ మిల్క్ కలెక్షన్ యూనిట్‌లను మంజూరు చేసి నూతన భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. జిల్లాలో రూ. 250.76 కోట్లతో 659 గ్రామ సచివాలయాలు మంజూరు కాగా, ఇప్పటివరకు 295 భవనాలు పూర్తి కాగా, 358 పనులు పురోగతిలో ఉన్నాయని, ఇందుకు గాను రూ. 114.51 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. అలాగే జిల్లాలో రూ. 94.15 కోట్లతో 538 విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు మంజూరు కాగా 110 భవనాలు పూర్తయ్యాయని, 428 పనులు పురోగతిలో ఉన్నాయని, ఇందుకు రూ. 29.74 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని ఎస్ఈ వివరించారు. జిల్లాలో 656 రైతు భరోసా కేంద్రాలకు 205 భవనాలు పూర్తయ్యాయని, 451 పనులు పురోగతిలో ఉన్నాయని, వాటికి రూ. 49.69 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. నాబార్డు గ్రాంటు, ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన్ ఫేజ్ 3 కింద రూ. 70.39 కోట్ల అంచనాలతో 15 రోడ్డు పనులు మంజూరు కాగా, 6 పనులు పూర్తయి, 9 రోడ్డు పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. అదేవిధంగా 2024 సంవత్సరం నాటికి జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి సురక్షిత మంచి నీరు కొళాయిల ద్వారా అందించడమే లక్ష్యంతో పనులు జరుగుతున్నాయని, ఈ పథకం కింద వివిధ కేటగిరీల్లో రూ. 486.54 కోట్ల అంచనాతో 3788 పనులు మంజూరైతే 790 పనులు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. అనంతరం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వివరిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లోని పనులు చేయడానికి వచ్చే ప్రతి నైపుణ్యం లేని కూలీ కుటుంబానికి ఏడాదిలో కనీసం 100 పని దినాలు కల్పించడమే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ముఖ్య ఉద్దేశమని, 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 83.96 పనిదినాలు కల్పించి రూ. 318.48 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. గ్రామీణాభివృద్ధి విషయాలపై జరిగిన స్థాయి సంఘ సమావేశంలో సెట్నల్, నెడ్ క్యాప్ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ఆయా శాఖల అధికారులు వివరించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న అందరు విద్యార్థులకు ప్రభుత్వం వారు బైజుస్ యాప్ ద్వారా డిజిటల్ పాఠ్యాంశాలు విద్యార్థుల తల్లిదండ్రుల సెల్‌ఫోన్ నందు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 8వ తరగతి చదువుతున్న 23,832 మంది విద్యార్థులకు, 2880 మందది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను సరఫరా చేయడం జరిగిందన్నారు. మనబడి, నాడు - నేడు కింద రెండో విడత 1385 పాఠశాలలను ఎంపిక చేసి, వాటిని ఆధునీకరించడంతో పాటు 2044 అదనపు తరగతి గదుల నిర్మాణాలకు రూ. 468.558 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. అనంతరం అన్ని శాఖల అధికారులు క్షుణ్ణంగా ఆయా శాఖల ద్వారా చేపడుతున్న పనులు, వాటి పురోగతిపై జెడ్పీ చైర్‌పర్సన్‌కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి, పంచాయతీరాజ్ శాఖ అశోక్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రంగవరప్రసాద్, ఎస్‌పిడిసిఎల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య, నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ రామలింగయ్య, డ్వామా పీడీ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకొని వ్యక్తి మృతి



**సంగం డిసెంబర్ 30 ప్రభాతవార్త** మండలంలోని కావలికాలువ రెగ్యులేటర్ వద్ద ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని తిరుపతయ్య అనే వ్యక్తి మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని సిఐ రవినాయక్, ఎస్ఐ నాగార్జునరెడ్డి, పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీదే విజయం



**కావలి, డిసెంబరు 30 ప్రభాతవార్త** రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అధికారం చేపడుతుందని, బిసిల అభివృద్ధిపై తొలి సంతకం చేస్తానని హర్షధ్వానాల మధ్య తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. కావలి బృందావనం హౌసింగ్ కాలనీ కళ్యాణమండపంలో శుక్రవారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడుల ఆధ్వర్యంలో బిసిల సదస్సు జరిగింది. ఈ సదస్సులో 14 కులాలకు చెందిన నేతలు మాట్లాడారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడారు. 140 బడుగు, బలహీన వర్గాల కులాలు తెలుగుదేశం పార్టీకి వెన్నెముకగా వున్నాయన్నారు. రానున్న మన పాలనలో బడుగు, బలహీన వర్గాల్ని ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాలలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందేలా పాటుపడతానన్నారు. తెలుగుదేశం పార్టీ రాక ముందు భూస్వాముల పెత్తందార్ల ఆధీనంలో బిసిలందరూ వున్నారన్నారు. సాధికారత లేక వున్న పరిస్థితులలో నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ ప్రారంభించి వెనుబడిన తరగతుల ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేశారన్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి పాలనలో బిసిలకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలకు 24 శాతం రిజర్వేషన్ కల్పించి లక్షలాది మందిని నాయకులుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఎంతో మందిని మంత్రులు, ఎమ్మెల్యేలను చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదేనన్నారు. బిసిలకు ఉన్నత పదవులు కట్టబెట్టి గౌరవించిన పార్టీ ఏకైక పార్టీ తెలుగుదేశమన్నారు. ఎంతో మంది మండలాధ్యక్షులు, చైర్మన్లుగా గెలిపించి బిసిలలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం జరిగిందన్నారు. తాను ముఖ్యమంత్రిగా గద్దెనెక్కిన తర్వాత 50 శాతం కల్గిన బిసి జనాభాకు 34 శాతం రిజర్వేషన్ కల్పించి బిసిలకు అత్యున్నత గౌరవం కల్పించడం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీలతో సమానంగా బిసిలకు ఫెడరేషన్, కార్పొరేషన్లు ఏర్పాటు చేశామన్నారు. మత్స్యకారులకు తెలుగుదేశం పార్టీ అండగా వుంటూ వారి సంక్షేమానికి పాటుపడ్డామన్నారు. మత్స్యకారులకు అధునాతనమైన బోట్లు, వలలు, పెట్రోలు ఇవ్వడంతో పాటు విపత్కర సమయాలలో సముద్రంలోకి వెళ్లలేని పరిస్థితులలో వారికి నగదు అందజేసి ఆదుకోవడం జరిగిందన్నారు. 118 కోట్ల రూపాయలు చేనేత కార్మికుల బకాయిల్ని రుణమాఫీ చేసిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కిందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఆలోచించి తెలుగుదేశ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేలా పాటుపడాలన్నారు.

**రానున్న ఎన్నికల్లో జగన్‌రెడ్డిని చిత్తుచిత్తుగా ఓడించాలి...**

రానున్న ఎన్నికలలో బిసిలందరూ సైకో జగన్‌రెడ్డిని చిత్తుచిత్తుగా కసి తీరా ఓడించాలని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సైకో, ఉన్మాది పాలన సాగుతోందని చెరమగీతం పాడాలన్నారు. జనాభాలో 50 శాతం వున్న బడుగు, బలహీన వర్గాల ప్రజలు అనుకుంటే జగన్ ప్రభుత్వానికి డిపాజిట్లు గల్లంతు అవుతాయని తెలిపారు. ఈ సైకో జగన్‌రెడ్డి పాలనలో బిసిలకు చెందిన ఒక్క కులానికి కూడా న్యాయం చేయలేదన్నారు. ఒక్క లోను కూడా ఇవ్వలేదన్నారు. భవన కార్మికులను మోసం చేసి లక్షలాది మందిని రోడ్డు పాలు చేసిన వ్యక్తి జగన్‌రెడ్డి అన్నారు. ఈ జగన్మోహన్‌రెడ్డి బిసిల ద్రోహి అన్నారు. గీత కార్మికులు అనాధిగా జీవనం సాగించే సారాయి వ్యాపారాన్ని కూడా జగన్‌రెడ్డి హస్తగతం చేసుకుంటున్నాడన్నారు. నకిలీ మద్యాన్ని ఏరుల్లా పారుస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతూ కోట్లాది రూపాయలు దోచుకుంటున్నాడన్నారు. రానున్న తెలుగుదేశ ప్రభుత్వంలో మద్యం దుకాణాలు 20 శాతం బిసిలకు అప్పగిస్తానన్నారు. పెళ్లి కానుక ఇవ్వాలంటే సవాలక్ష ఆంక్షలు విధిస్తున్న ఈ జగన్‌రెడ్డి అవినీతికి మాత్రం ఎటువంటి ఆంక్షలు లేవని దుయ్యబట్టారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో కొంతమంది రెడ్లకే పెత్తనమని మిగిలిన రెడ్లు అందరూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెడ్డి కులస్తులను కూడా మోసం చేస్తున్న ఘన చరిత్ర ఈ సైకో సియంకే దక్కిందన్నారు. కుర్చీలు, బెంచీలు లేని ఫెడరేషన్లు ఇచ్చి జగన్‌రెడ్డి నాటకమాడుతున్నాడన్నారు.

**బిసి నేతలపై దాడులు, జైళ్లకు పంపడం...రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం**

మాజీ మంత్రి కొల్లు రవీంద్ర నీతి నిజాయితీలకు మారుపేరుగా నిలిచారని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

కొల్లు రవీంద్రపై తప్పుడు కేసులు పెట్టి జైలు పాలు చేశారన్నారు. అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడులపై తప్పుడు కేసులు పెట్టి జైలు పాటు చేశారన్నారు. ఈ సైకో సియం పాలనలో 26 మంది బిసి నాయకుల్ని హత్య చేశారన్నారు. రోజులు వస్తాయని తిరిగి ఈ ముఖ్యమంత్రికి, అనుచరులకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని చంద్రబాబు హెచ్చరికలు చేశారు. రజక కులస్తులు బట్టలు ఉతికినట్లు జగన్‌రెడ్డిని ఉతికి పారేయాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశ పాలనలో చేసిన అభివృద్ధి పథకాలన్ని బిసి నేతలకు గుర్తు చేశారు. ఆక్వా రంగంలో జగన్ కాలు పెట్టడంతో ఆ రంగం మోటాష్ అయిందన్నారు. ఈ సియం పాలనలో రాష్ట్రం అంధకారంగా మారిందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల బ్రతుకులు ఛిద్రంగా మారాయన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు తమ అభివృద్ధి కోసం తెలుగుదేశ ప్రభుత్వం అధికారంలోకి తీసుకొచ్చేందుకు పాటుపడాలన్నారు. ఈ సదస్సులో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నెల్లూరు పార్లమెంటు అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు, లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోట్లూరి శ్రీనివాసులు, టిడిపి సీనియర్ నేత డాక్టర్ జెడ్ శివప్రసాద్, తదితర నేతలు పాల్గొన్నారు. బృందావనం హౌసింగ్ కాలనీ కళ్యాణ మండపం బిసి నేతలతో కిక్కిరిసిపోయింది.

## ఎపి జెన్కో ఆందోళనకు తన సంపూర్ణ మద్దతు

### జెఎసికి హామీ ఇచ్చిన చంద్రబాబు



**కావలి, డిసెంబరు 30 ప్రభాతవార్త** ఎపి జెన్కో శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనకు తన సంపూర్ణ మద్దతు వుంటుందని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఎపి జెన్కో పరిరక్షణ కమిటీ, జెఎసి ఆధ్వర్యంలో శుక్రవారం కావలిలో చంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 345 రోజులుగా ఆందోళన జరుగుతోందని పరిరక్షణ కమిటీ, జెఎసి నేతలు చంద్రబాబుకు తెలిపారు. వెనక్కి తగ్గవద్దని తన సంపూర్ణ మద్దతు వుంటుందని చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ కన్వీనర్ యం.మోహన్‌రావు, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, బీద రవిచంద్ర, బొమ్మి సురేంద్ర, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, ఎఐఎఫ్‌టియు న్యూ జిల్లా నాయకులు పి.యానాదయ్య, లక్ష్మిరెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, టిఎన్‌టియుసి జిల్లా నాయకులు కళ్యాణ్, ప్రసాద్, సిపియం నాయకులు పెంచలయ్య, మాల్యాద్రి, ఎపి జెన్కో జెఎసి నాయకులు సి.హెచ్.ఆదిశేషయ్య, ఎ.అనిల్, కె.రవి, భాస్కర్, పి.మోహన్‌రావు, శ్యామ్, సునీల్, ఈశ్వరయ్య, నక్కా మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది



**కందుకూరు, డిసెంబరు 30, ప్రభాతవార్త** ఈనెల 28వ తేదీన కందుకూరులో జరిగిన దుర్ఘటన దురదృష్టకరమని మృతుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి వర్యులు కాకాని గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 28వ తేదీ కందుకూరులో జరిగిన దుర్ఘటనలో కందుకూరు మండలం కొండముదుసుపాలెం గ్రామానికి చెందిన కలవకూరి యానాది, ఒగూరు గ్రామానికి చెందిన గద్దమధుబాబు, కందుకూరు పట్టణం గుర్రంవారిపాలెంకు చెందిన కాకుమారి నాగరాజా, ఉలవపాడు మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన దేవినేని రవీంద్రబాబు, ఉలవపాడు గ్రామానికి చెందిన యాటగిరి విజయ, గుడ్లూరు మండం గుండ్లపాలెం గ్రామానికి చెందిన ఉచ్చులూరు పురుషొత్తం, అమ్మవారిపాలెం గ్రామానికి చెందిన మర్లపాటి చిన్న కొండయ్య మృతిచెందిన వారిలో ఉన్నారు. వారి కుటుంబ సభ్యులకు కందుకూరు సబ్‌కలెక్టర్ వారి కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి వర్యులు గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు, కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీదర్‌రెడ్డితో కలసి ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల చొప్పున 8 మందికి రాష్ట్ర ప్రభుత్వం తరపున బ్యాంకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు మీడియాతో మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన కందుకూరులో జరిగిన దుర్ఘటనలో 8 మంది మృత్యువాత పడ్డారన్నారు. వారి కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారన్నారు. దుర్ఘటన జరిగిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి అధికారులను, స్థానిక ఎమ్మెల్యే అప్రమత్తం చేసే బాధితులకు సహాయ సహకారాలు అందజేయాలని క్షతగాత్రులకు తక్షణమే వైద్య సహాయం అందించాలని సూచించారన్నారు. కుటుంబ సభ్యులను కోల్పోయి శోకసంద్రంలో ఉన్న వారిని పలకరించి ప్రభుత్వం వారికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని వైద్యం చెప్పామన్నారు. వారి మానసిక స్థితిని అర్ధం చేసుకొని అంత్యక్రియలు పూర్తయిన తర్వాత నేడు ఆర్థిక సహాయాన్ని అందజేశామన్నారు. మృతిచెందిన ఆత్మశాంతి కలగాలని, కుటుంబ సభ్యులు లేని లోటును తట్టుకొని ముందుకెళ్లేలా ధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటూ ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. మృతిచెందిన వారికి నివాళ్లులర్పిస్తున్నామన్నారు. దుర్ఘటన ఎలా జరిగిందో త్వరగా పోలీసు విచారణ పూర్తి చేయించి బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. కందుకూరు ఇంఛార్జి ఆర్డీఓ కావలి ఆర్డీఓ శీనానాయక్, తహశీల్దార్ సీతారామయ్య లు పాల్గొన్నారు.

## తమిళ తంబిల సైకిల్ యాత్ర



**మనుబోలు, డిసెంబరు 30 ప్రభాతవార్త** గ్రీన్ అండ్ హెల్త్ సందేశమిస్తూ తమిళనాడు సేలంకు చెందిన చిన్నారి విద్యార్థులు సైకిల్ టూర్కు ఆంధ్రకు బయలుదేరారు. సైకిల్ తొక్కుతూ విజయవాడ వైపు వెళుతూ శుక్రవారం మనుబోలులో కొంతసేపు 'ప్రభాతవార్త'తో ముచ్చటించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ కోచ్‌రాశి రాజన్ మాట్లాడుతూ పచ్చదనం, ఆరోగ్యం పేరుతో ప్రజల్లో అవగాహన కలిగించేందుకు చిన్నారులతో కలిసి సేలం నుండి విజయవాడకు సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఏడు మంది చిన్నారి విద్యార్థులు ఎంతో హుషారుగా సైకిల్ తొక్కుతూ రోజుకు 100 కిలోమీటర్లు యాత్ర కొనసాగిస్తున్నట్లు తెలిపారు. వీరిలో ఐదు మంది బాలురు, ఇద్దరు బాలికలు వుండడం విశేషం. 1150 కిలోమీటర్లు కొనసాగుతుందని తెలిపారు. మరో వారం రోజుల్లో విజయవాడ చేరుకుని తిరిగి రైలులో సేలం వెళ్లిపోతామని తెలిపారు. హైవేలో దారిపొడుగునా మా సైకిల్ యాత్రకు తెలుగు ప్రజలు ఆదరణ చూపారని రాశి రాజన్ తెలిపారు.

# రహదారి భద్రత చర్యలు కట్టుదిట్టంగా చేపట్టండి



**నెల్లూరు అర్బన్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ వారి క్యాంప్ కార్యాలయంలో జిల్లా రహదారి భద్రత కమిటీ అధికారులతో నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపాలిటీలో జాతీయ రహదారుల్లో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వాటి నివారణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలన్నారు. కావలి, బుచ్చిరెడ్డిపాళెం మునిసిపాలిటీల నుంచి ఇంకా నివేదికలు అందలేదని, వెంటనే ప్రమాదం జరిగే ప్రాంతాలు పరిశీలించి సూచిక బోర్డుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కందుకూరు మోచర్ల రహదారి ప్రమాదంలో ఐదు మంది మృతి చెందారని, బాధ్యులైన వారికి కఠినంగా శిక్ష పడేలా చర్యలు చేపట్టాలన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరంలో 74 ప్రమాదాలు తగ్గాయని, 94 మరణాలు తగ్గాయని రహదారి భద్రత నియమాలు మరింత కట్టుదిట్టంగా అమలు చేసి వాటిని మరింతగా తగ్గించాలన్నారు. ఈ సంవత్సరం జరిగిన 340 మరణాల కేసులలో 10 ప్రధానమైన కేసులను తీసుకుని వాటిని క్షుణ్ణంగా విశ్లేషించాలని, మరణాలు తగ్గించడానికి కమిటీ ప్రతిపాదనలు సిద్ధం చేసి తీసుకునిరావాలన్నారు. బుజబుజనెల్లూరు, గొలగమూడి వద్ద జాతీయ రహదారిలో పై వంతెనలు నిర్మాణాన్ని వెంటనే చేపట్టి త్వరగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు రహదారి భద్రతా నియమాలు సూచిక బోర్డులపై సరైన అవగాహన కలిగించా లన్నారు. జాతీయ రహదారులు ఆరు వరుస రహదారుల్లో ప్రతి 15 కిలోమీటర్ల జంక్షన్‌లలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆత్మకూరు బస్టాండుపై వంతెన నుంచి సాయిబాబా దేవాలయం మార్గంలో ప్రమాదాలకు కారణమవుతున్న ఆక్రమణలను తొలగించేందుకు వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు. నగరంతో పాటు అన్ని మున్సిపాలిటీలలో ఈ నెల 31వ తేదీ రాత్రి నుంచి నిర్ణీత వేళల్లో నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మనుబోలు జాతీయ రహదారి -16 మార్గంలో కల్వర్టు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ప్రమాదాలు నివారించాలన్నారు. నగరంతో సహా అన్ని మున్సిపాలిటీలలో రద్దీ నివారణకు సిగ్నల్స్ పాయింట్లను గుర్తించి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి మంగళవారం రహదారి భద్రతపై బాగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, అవి నిరంతరం కొనసాగాలని సూచించారు.

# ఆకట్టుకున్న భారీ ర్యాలీ- భారీమాలతో చంద్రబాబుకు స్వాగతం





**కోవూరు, డిసెంబరు30 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గంలోని కోవూరు పట్టణానికి తొలిసారిగా వచ్చిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు స్థానిక సాయిబాబా గుడిలో పార్టీ నేతలు భారీస్థాయిలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు భారీ పూలమాలతో అలంకరించేలా కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పోలంరెడి దినేష్‌రెడ్డి భారీ క్రేన్ కూడా తెప్పించారు. ఈ సందర్భంగా స్థానిక సాయిబాబా గుడి నుంచి సాలుచింతల వరకు నిర్వహించిన రోడ్ షోలో భారీ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు అభిమానులు ప్రజలు హాజరుకావడం పట్ల తెలుగుతమ్ముళ్లలో పూర్తిగా జోష్ నిండింది. గత వారం రోజులుగా వారు చేసి కృషికి ఎట్టకేలకు ఫలితం రావడం పట్ల చంద్రబాబు పర్యటన కోవూరు టీడీపీ నాయకుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపింది. మేళతాళాలు, మంగళవాయిద్యాలు కీలుగుర్రాలు, డప్పుల మోతలతో కోవూరు పట్టణమంతా శుక్రవారం అలరించింది. బజారుసెంటర్ ప్రాంతంలో పురవీధుల్లో చం ద్రబాబుపై పూలవర్షం కురిపించారు.

**దినేష్‌రెడ్డికి ప్రాధాన్యతిచ్చిన చంద్రబాబు**

కోవూరు తెలుగుదేశంపారీ ఇన్‌చార్జ్‌గా గా పోలంరెడ్డి దినేష్‌రెడ్డిని చంద్రబాబునాయుడు తనతో సమానంగా తన ప్రక్కనే నిలబెట్టుకొని ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీలో ముందుకు సాగారు. దినేష్‌రెడ్డి కూడా రెండు చేతులు జోడించి ప్రజల్ని నమస్కరించడం అందరినీ ఆకట్టుకుంది. స్థానిక సాయిబాబా గుడి నుంచి సాలుచింతల సెంటర్ వరకూ సాగిన ఈ ర్యాలీలో చంద్రబాబు ఎంతో హుషారుగా చేతులు ఊపుతూ విక్టరీ చూపుతూ ఉత్సాహంగా సాగడం తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో మంచి జోష్‌ను చూపింది. దీనికి తోడు జనసమీకరణలో సైతం దినేష్‌రెడ్డి చొరవచూపి చంద్రబాబు నాయుడు వద్ద ప్రశంసలు కూడా పొందాడు. ఈ జనవాహిని చూసి తన హృదయం ఆనందమయంతో పొంగిపోయిందని వచ్చిన ప్రతీ ఒక్కరికీ తన శిరస్సు వంచి పాదాభివందం చేయం ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

## మన గ్రామభవిష్యత్తు మనచేతులపై



**పొదలకూరు డిసెంబర్ 30 ప్రభాతవార్త:** మండలంలోని పులికల్లు గ్రామ పంచాయితీలో సర్పంచ్ జి.వి సుబ్బమ్మ అద్యక్షతన గ్రామ సెక్రటరీ మాధవి 2023,24 సంవత్సరానికి గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శిక్షణలో భాగంగా గ్రామ పంచాయితీ అభివృద్ధికి మహిళలు,పిల్లలు అట్టడుగు వర్గాలు వికలాంగులు తదితరులందరు భాగస్వామ్యం అవ్వాలి వీరందరికి అవసరాలు ఏంటి, వారికి ఏమి కావాలి, అని పంచాయితీ ప్రజలే గొంతు వినిపించాలని సెక్రటరీ మాధవి కోరారు. మన అభివృద్ధి లక్ష్యాన్ని మనమే నిర్ణయించుకోవాలని అందుకు మార్గాన్ని అమలు చేసుకోవాలని పిలుపునిచ్చారు.పంచాయితీ పరిధిలోని మూడు గ్రామాల ప్రజలు, విద్యార్ధులతోపాటు అధికారులు వెలుగుసిసి వెంకటేశ్వర్లు,లైన్ ఇనస్పెక్టర్ శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది సంక్షేమాధికారి శ్రీలక్ష్మి,వ్యవసాయాధికారి శ్రీనివాసతేజా, ఇంజనీరింగ్ అధికారిణి అరుణ,ఎఎన్ఎం ప్రసన్న,నాయకులు పెంచలరెడ్డి నారాయణరెడ్డి,పొదుపు మహిళలు,అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి,విజయలక్ష్మి,పల్లవి,ఆశా సుమతి,యూత్ వాలింటరీలు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబురోడ్డుషోకి తరలిన పొదలకూరు టిడిపి నేతలు



**పొదలకూరు డిసెంబర్ 30 ప్రభాతవార్త:** టిడిపి జాతీయ అద్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు " ఇదేం ఖర్మ "లో భాగంగా శుక్రవారం కోవూరు పట్టణంలో నిర్వహిస్తున్న రోడ్డు షోకి పొదలకూరు టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.గ్రామాల నుండి కార్యకర్తలు ప్రత్యేక వాహనాలలో,మోటార్‌బైకులలో స్వచ్ఛంధంగా బయలు దేరారు. కోవూరు రోడ్డుషో విజయవంతానికి పొదలకూరు టిడిపి శ్రేణులు రెట్టింపు ఉత్సహంతో నినాదాలు చేస్తు వెళ్లారు.ఈకార్యక్రమంలో మండలాద్యక్షులు తలచిరు మసా _న్‌బాబు పట్టణ అద్యక్షులు మల్లికార్జుననాయుడు,టిడిపి సీనియర్‌నాయకులు రామజోగి నాయుడు,బక్కయ్యనాయుడు,కోడూరు బాస్కర్‌రెడ్డి,అక్కెం సుధాకర్‌రెడ్డి,బోగోలు బాస్కర్‌రెడ్డి, పులిపాటి వెంకటరత్నం నాయుడు,మద్దెరెళ్ల నరసింహులు యాదవ్,కొంగి వెంకటరమణయ్య, వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి,రమేష్‌రెడ్డి,హనుమారెడ్డి,సుబ్బారెడ్డి, సుబ్బరామిరెడ్డి, కలగట్ల సందీప్, ప్రభాకర్, ఖాదర్‌భాషా, చినమస్తాన్,శ్రీనివాసులు,డేగ హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరి తొట్టిని శుభ్రం చేయించిన కార్యదర్శి



**ఉదయగిరి డిసెంబర్ 30 ప్రభాతవార్త:** ఉదయగిరి మండలంలోని కోనకాలువకు సంబంధించిన తొట్టిని ఉదయగిరి పంచాయితీ కార్యదర్శి ఆర్ నరసయ్య గ్రామ పంచాయితీ సిబ్బందిచేత శుభ్రం చేయించారు.ఈ తొట్టి ఉదయగిరి వాసుల నీటి కష్టాలను దూరం చేయుటకు దోహదపడుతుంది.ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామ ఉపసర్పంచ్ ముర్తుజా, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు



**బిట్రగుంట, డిసెంబరు 30 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన బోగోలులోని బృందావనం గ్రౌండ్ నందు శుక్రవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గత రెండు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ముగిశాయి. ఈ ఫుట్‌బాల్ పోటీలలో నెల్లూరు, బిట్రగుంట ఫైనల్స్ జరగగా బిట్రగుంట జట్టు విజయం సాధించింది. ఆర్‌సియం చర్చి ఫాదర్ రెవ.పాల్ విజేతలకు బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు సి.హెచ్.నాగరాజు, స్టీఫెన్, అంతోని కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## డ్రోన్‌తో పిచికారీ సులభతరం

**చేజర్ల,డిసెంబర్30ప్రభాతవార్త:** రైతులు సాగుచేసుకుంటున్న తమ పంట పొలాల్లో డ్రోన్ ద్వారా పురుగుమందులను పిచికారీ చేయడం సులభతరంగా మారింది. సాధారణంగా పంట సాగులో ఉన్నప్పుడు ట్రాక్టర్‌తో మందును పిచికారీ చేయాలంటే టైర్ల కింద కొంత పంట నలిగిపోతుంది . అలాగే స్ప్రేయర్లద్వారా మందు పిచికారీ చేయాలన్నా నడిచే సమయంలో కొంత పంట కాళ్ళకింద పడడంతోపాటు మందులో నీటిని కలిపేందుకు మరో మనిషి కూడా అవసరమవుతారు. అదే డ్రోన్ ద్వారా అయితే సులభతరంగా మందును పిచికారీ చేయవచ్చు. శుక్రవారం చిత్తలూరులో జొన్నపైరు కు నెల్లూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం వారు డ్రోన్ ద్వారా మందును పిచికారీ చేయడం ప్రదర్శించారు .సాధారణంగా లీటరు మందు అవసరముండగా డ్రోన్ అయితే 750మి.లీ మందు సరిపోతుంది. అలాగే 10లీటర్ల నీటితో మందును తక్కువ సమయంలో స్ప్రే చేయవచ్చు. ఎత్తైన ప్రదేశంనుంచి మందును స్ప్రే చేయడం వలన సన్న తుంపరులు పంట మొత్తానికి అందుతుంది. ప్రవేటు ఏజెన్సీల ద్వారా అయితే ఎకరాకు 400రూపాయలు వసూలు చేస్తారు. వ్యవసాయ పరిశోధనా కేంద్రం వారు మాత్రం ఎకరాకు 300రూపాయలకు డ్రోన్‌ను సమకూరుస్తున్నారు. దీంతో డ్రోన్‌తో మందును పిచికారీ చేసేందుకు ముందుకు వస్తున్నారు.

## సాగుపంటలలో తెగుళ్ళు నివారణ



**కలువాయి డిసెంబర్ 30 ప్రభాతవార్త:** మండలంలోని సాగు చేస్తున్న పలు పంటలలో తెగుళ్ల వాటినివారణ చర్యలగురించి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి వి.ప్రతాప్ ఆద్వర్యంలో ఎ ఆర్ఎస్ పొదలకూరు శాస్త్రవేత్త నాగమణి నివారణ చర్యలపై శుక్రవారం అవగాహన వాటికి సంబంధించిన మందులు వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని కలువాయి, సవటపల్లి, వెరుబొట్లపల్లి,చీపినాపి,తోపుగుంట,కనుపూరు పల్లి,చింతలాత మ్రకూరు గ్రామాలలో సాగు చేస్తున్న పచ్చిశనగకు వేరుకుళ్ళు తెగుళ్ల ఆకు తెగుళ్ల కాండం కుళ్ళు తెగుళ్ల,రబ్బరుపురుగు,శనగపచ్చపురుగులు గమనించడం జరిగిందని వ్యవసాయాధికారులు తెలిపారు. ఇందుకు తెగుళ్ళ నివారణకు పంటల సస్యరక్షణకు వాడవల్సిన మందులను వాటిపద్ధతులను రైతులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో విలేజి అగ్రికల్చర్ అసిస్టెంట్లు రత్నం,వెంకయ్య,నాగభూషణం,కిషోర్,రైతులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి మారు పేరు ఆనం..ఆనంతోనే అభివృద్ధి



**రాపూరు, డిసెంబరు 30 ప్రభాతవార్త:** జిల్లాలో అభివృద్ధి అంటే ఆనం అని, ఆనంతోనే జిల్లాలో అనేక అభివృద్ధి పనులు జరిగాయాని రాపూరు మండల వైసిపి నేతలు పేర్కొన్నారు. శుక్రవారం రాపూరు యంపీపీ కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వెంకటగిరి ఏమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి ఎక్కడ ఎమ్మెల్యేగా ప్రతినిధ్యం వహించినా ఆప్రాంతంలో ఎనలేని అభివృద్ధి చేశారని వారు తెలిపారు. అభివృద్ధికి నోచుకోని ఈ ప్రాంతాలు ఆనం కుటుంబం రాజకీయ ఆగమనంతోనే అభివృద్ధి సాధించాయని వారు తెలిపారు.అంధకారంలో వున్న ఈ ప్రాంతంలోని అనేక ప్రాంతలకు విద్యుత్ సౌకర్యం,తాగునీటి,సాగునీటి వసతులు,రోడ్లు కల్పించిన ఘనత ఒక్క ఆనం కుటుంబానికే చేందుతుందని వారు చెప్పారు. అత్యంత వెనుకబడిన ఈ ప్రాంతంలో ప్రజాప్రతినిధిగా నిరంతరం ఈ ప్రాంత ప్రజల క్షేమమే ఆనం కుటుంబం లక్ష్యంగాఅధికార ప్రతిపక్ష పార్టీల ప్రమేయం లేకుండా ఈ ప్రాంత రైతాంగానికి సాగునీటిని అందించేందుకు నాడు అమరణ నిరాహార దీక్ష చేసి ఈ ప్రాంత వాసులకు సాగునీరు ఇప్పించిన ఘనత ఒక్క ఆనం రామనారాయణ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. అటువంటి ఆనం రామనారాయణ రెడ్డిపై ఎవరో కోందరు చిల్లర వేషగాళ్లు, మిడిమిడి,జ్ఞానంతో విమర్శలు చేయడం సరికాదన్నారు. ఆనం పై విమర్శలు చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ చిగురుపాటి ప్రసన్న, రాపూరు మండల వైసిపి నాయకులు నల్లవడ్ల వెంకటరమణా రెడ్డి, పెనుబర్తి,కంభాలపల్లి, బోజ్జనపల్లి, రాపూరు బిట్ 2, సిద్దవరం, యంపీటీసీలు, యంవిపురం, కంభాలపల్లి, శానాయపాళెం, గిలకపాడు, తూమాయి, చెర్లోపల్లి, జోరేపల్లి, అకిలివలస, గ్రామ సర్పంచ్‌లు, రాపూరు మండల కోఆప్సన్ సయ్యద్, వైసిపి నాయకులు బోడ్డు మధుసూధన్ రెడ్డి, కయ్యూరు మురళీ మోహన్ రెడ్డి, మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డి,పెద్ద ఎత్తున మండలంలోని అన్ని గ్రామపంచాయితీల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

# కార్పొరేషన్‌లో విధులు బహిష్కరించిన కాంట్రాక్టర్ డ్రైవర్లు



**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** నెల్లూరు కార్పొరేషన్‌లో కాంట్రాక్టర్ కింద పని చేస్తున్న చెత్త వాహనాల డ్రైవర్లు పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ గురువారం ఉదయం విధులు బహిష్కరించారు. ఇందులో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియర్ నెల్లూరు నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, సీఐటియు నెల్లూరు రూరల్ కార్యదర్శి కిన్నెర కుమార్ ప్రసంగించారు. నెల్లూరు నగరపాలక సంస్థలో 200కు పైగా చెత్త వాహనాల డ్రైవర్లు ఉన్నారని, వారిలో 150 మందికి రూ. 18,500 జీతం ఇస్తుండగా, మిగతా 50 మందికి రూ. 8250 జీతం ఇస్తున్నారన్నారు. నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వకుండా బకాయిలు పెట్టి ఉన్నారన్నారు. జీతాలలో పట్టుకున్న పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ చేయడంలేదని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉండగా కాంట్రాక్టర్ వ్యవస్థకు వ్యతిరేకంగా సీఐటియుతో కలిసి ఉద్యమాలు చేసిన నెల్లూరు సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు అధికారంలోకి వచ్చిన తరువాత కాంట్రాక్టర్ వ్యవస్థను తీసుకురావడం సిగ్గు చేటన్నారు. గత నాలుగు నెలల నుంచి జీతాలు రాక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించమని అధికారులను వేడుకున్నా ఫలితం లేకుండా పోయిందని బాధను వ్యక్తపరిచారు. విధి లేని పరిస్థితుల్లో విధులు బహిష్కరించవలసి వచ్చిందని చెప్పారు. ఇప్పటికైనా తక్షణమే కార్మికుల సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర ‸మంలో సీఐటీయు నెల్లూరు రూరల్ కార్యవర్గ సభ్యులు డి.సంపత్‌కుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి ఎం.అశోక్, నాయకులు వెంకటేశ్వర్లు,పవన్, కాంట్రాక్టు డ్రైవర్లు పాల్గొన్నారు.

# అవహేళన చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**కలువాయి డిసెంబర్ 30 ప్రభాతవార్త:** హిందూ దేవి,దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తు హైందవ ,సనాతన ధర్మాన్ని కించపరచినా,కించపరిచే విధంగా మాట్లాడిన ధర్మద్రోహులను కఠినంగా శిక్షించాలని కలువాయి హిందుధర్మ పరిరక్షణ సమితి సభ్యులు హెచ్చరించారు.తెలంగాణా రాష్ట్ర నాస్తిక సంఘం అద్యక్షుడునని చెప్పుకుంటున్న బైరి .నరేష్‌పై తక్షణమే పీడియాక్ట నమోదు చేయాలని సమితి సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు.శుక్రవారం కలువాయిలో వారు విలేఖర్లతో మాట్లాడుతు కోట్లాదిమంది పూజిస్తున్న అయ్యప్ప స్వామి జననంపై పిచ్చిపిచ్చిగా మాట్లాడి భారతీయహైందవ సనాతనా ధర్మన్ని అవహేళన చేసినా ఇటువంటి ధర్మద్రోహిని కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ఇటువంటి వ్యాఖ్యలు చేసిన వారిపట్ల ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహారించపట్టే సమాజంలో ఇటువంటు వ్యక్తులు రెచ్చిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇలాంటి దొంగ నాస్తికులను హిందూ సమాజం ఎప్పటికి క్షమించదని వారు తెలిపారు.భారతీయ హైందధర్మం ప్రపంచానికే మార్గదర్శిగా ఉందని అలా ంటి ధర్మాన్ని విమర్శించడం దేవిదేవతలను దూషించడం చాలా హేయమైనటుంటి చర్య అని దీనిని హిందు సమాజం ముక్తకంఠంతో ఖండిస్తుందని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో సమితి సభ్యులు మల్లికార్జున, నరేష్, పెంచలయ్య, విజయభాస్కర్‌రెడ్డి ,మహేష్, విఘ్నేష్, రేణయ్య తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు పర్యటన దృశ్యమాలిక



















## చంద్రబాబు రోడ్డుషోకి తరలిన బుచ్చి నేతలు



**బుచ్చి డిసెంబర్ 30 ప్రభాతవార్త** కోవూరులో జరిగే చంద్రబాబు రోడ్డుషోకి బుచ్చిరెడ్డిపాలెం నుండి పెద్ద ఎత్తున టిడిపి నాయకులు భారీగా తరలివెళ్లారు. టిడిపి నాయకులు వింజం రామానాయుడు ఆధ్వర్యంలో మహిళలు ,కార్యకర్తలు ఆటోలలో బయలు దేరారు.అలాగే మండలంలోని నాయకులు పెద్ద ఎత్తున బయలుదేరి దామరమడుగు వద్ద నుండి కోవూరుకి భారీగా ర్యాలీ నిర్వహించారు. మండల పార్టీ అద్యక్షులు ఎం.వి శేషయ్య,బత్తలహరికృష్ణా, నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి,బండ్ల కొండయ్య , జూగుంట పురుషోత్తమ్ గ్రామాలలోని నాయకులు జనాన్ని నాయకులతో,కార్యకర్తలుఆటోలలో,మోటార్‌బైకులలో పెద్దఎత్తున తరలి వెళ్లారు.టౌన్ అద్యక్షులు తాళ్లనరసింహస్వామి,వల్లూరు శ్రీనివాసులు, దుగ్గిశెట్టిహరినాద్,దశరద్, ఇప్పగుంట సుధాకర్‌రెడ్డి, మైనార్టీనాయకులు,బషీర్,అక్తర్,షబ్బీర్,ఖాదర్‌భాషా (చోటు), రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షేక్ జాఫర్‌భాషా, తది తరులు తరలివెళ్లారు.

## సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం



**బిట్రగుంట, డిసెంబరు 30 ప్రభాతవార్త** బోగోలు మేజర్ పంచాయతీలోని ముస్లిం మైనార్టీ ఏరియా నందు శుక్రవారం సిమెంటు రోడ్డునిర్మాణ పనులను మండల వైసిపి అధ్యక్షులు మదిబోయిన రఘు ప్రారం భించారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎంపిపి నిధులతో ఈ ప్రాంతంలో సిమెంటు రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ యువత అధ్యక్షుడు మేకల శ్రీను, కోఆప్షన్ సభ్యులు నాయబ్‌రసూల్, ఎంపిటిసి సభ్యులు సుం దర్‌రాజ్, పార్టీ సీనియర్ నాయకులు టి.పెంచలయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## పీటీడీ క్యాలెండర్ ఆవిష్కరణ



**కోవూరు, డిసెంబరు30 ప్రభాతవార్త :** కోవూరులోని కార్యాలయంలో శుక్రవారం పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ నాయకులంతా కలిసి కట్టుగా ఉండి ఏమైనా సమస్యలు వస్తే వాటిని పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాన్ ఆపరేషన్ కార్యదర్శి ఎస్‌డీ సాజుద్దీన్, ప్రెసిడెంట్ అర్లయ్య, సభ్యులు ఎస్‌కే ఖాసిం, జఫ్రుల్లాఖాన్, రామ్‌కుమార్, అన్వర్, షరీఫ్, ఎస్‌కే భాబు, రాష్ట్ర బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిషోర్ సింగ్, కోఆప్షన్ సభ్యులు సుబేర్ బాషా, శివకుమార్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## వినూత్న బోధనతోనే సరైన అభ్యసన ఫలితాలు



**కోవూరు, డిసెంబరు30ప్రభాతవార్త :** ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా ఉంటూ నిరంతరం విషయాలను శోదిస్తూ వినూత్నపద్దతుల్లో బోధనను అనుసరించినప్పుడే మంచి ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉం టుందని కోర్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ జుల్ఫికర్ ఆలీఅన్నారు. కోవూరులోని సెయింట్ పాల్స్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో శుక్రవారం విద్యా అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రధానో పాధ్యాయులకు, ఉపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మా టాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు రానున్న డిజిటల్ యుగంలో అనుసరించవలసిన బోధనా పద్దతుల్లో భాగంగా ప్రాజెక్టును ఏవిధంగా అప్‌లోడ్ చేయాలనే విషయంపై రిసోర్స్ పర్సన్ వెంకట్‌తో కలిసి ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ప్రతి ఉపాధ్యాయుడిలో కొన్ని నూతన , ప్రత్యేక బోధనా పద్దతులు సృజ నాత్మకత దాగిఉంటాయని,వాటిని ఉపాధ్యాయులు పరస్పరం తెలుసుకోవడం ద్వారా నూతన బోధనా విష్కరణలు వెలుగులోకి వస్తాయన్నారు. దీని ద్వారా అన్ని పాఠశాలలోని విద్యార్థులకు సులువుగా బోధన చేయడంతో పాటు వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందన్నారు.

## గ్రంథాలయ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



**కోవూరు, డిసెంబరు30 ప్రభాతవార్త :** కోవూరులోని శాఖా గ్రంథాలయంలో చేపట్టనున్న అభివృద్ధి పనులను శుక్రవారం డీఈ సుబ్బారావు , ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డిలు పరిశీలించారు. గ్రంథాలయ నిర్మాణ పనులు మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తిచేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా రాధాకృష్ణారెడ్డి సూచించారు. వైసీపీ నాయకులు సాయియశ్వంత్‌రెడ్డి, నాగరాజు, తదితరులు ఉన్నారు.

## కార్యకర్తల్లో జోష్ నింపిన పరసా, ధర్మవరం



**కోవూరు, డిసెంబరు30 ప్రభాతవార్త :** కోవూరు పట్టణంలో శుక్రవారం చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రోడ్ షో సందర్భంగా మాజీ మంత్రి పరసా రత్నం, నెల్లూరు నగర అధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావులు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు టీ షర్టులు, జెండాలు, ప్లకార్డులు పంపిణీ చేశారు. వీరిరువురు గత నాలుగు రోజులుగా కోవూరు మండలంలో పర్యటిస్తూ కార్యకర్తల్లో పూర్తిస్థాయిలో ఉత్సాహాన్ని నింపేలా కృషి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ గణేష్‌కుమార్, కంచి మల్లికార్జునరెడ్డి, రాజా, తదితరులు ఉన్నారు.

## ట్యాబ్‌ల ద్వారా సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



**కోవూరు, డిసెంబరు30 ప్రభాతవార్త :** కోవూరులోని గంగవరంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామ సర్పంచ్ లక్ష్మీకుమారి ప్రభుత్వం ద్వారా వచ్చిన ట్యాబ్‌లను వారికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రాథమిక దశ నుంచి నూతన సాంకేతిక నైపుణ్యాలపై మరింత అవగాహన పెంచేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. విద్యార్థులు కూడా ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుని అభివృద్ధి లోకి రావాలని సూచించారు. ఇప్పటికే నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను ముఖ్యమంత్రి మార్చివేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోషే, పంచాయతీ కార్యదర్శి కరుణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి బహిరంగ సభకు భారీ బందోబస్తు



**కోవూరు, డిసెంబరు30 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోవూరుకు శుక్రవారం వస్తున్న సందర్భంగా కోవూరు పట్టణంలో పోలీసు బలగాలు భారీగా చేరుకున్నాయి. ప్రధానంగా చంద్రబాబు నాయుడు ప్రసగించే బజారు సెంటర్ ప్రాంతంలో అడిషనల్ ఎస్పీ హిమవతి, ఈఎస్పీ వీరాంజనేయరెడ్డి, భారీస్థాయిలో సీఐలు, ఎస్సైలు ఆ ప్రాంతంలో మోహరించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. కందుకూరులో జరిగిన సంఘటన మరలా పునరావృతం కాకుండా కోవూరు పోలీసులు భారీ స్థాయిలో బందోబస్తు చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్‌ను కూడా క్రమబద్ధీకరించేలా రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, కోవూరు సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై వెంకటేశ్వరరావులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



**సైదాపురం, డిసెంబరు 30, పభాతవార్త:** గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ హెచ్చరించారు. సైదాపురంలోని సచివాలయం -1, 2లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హాజరు పట్టికలు, పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో లేకుండా సమయపాలన పాటించకుంటే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సచివాలయంలో రికార్డులు సరిగా నమోదు చేయకపోవడంతో సిబ్బందిని మందలించడం జరిగిందన్నారు. ముఖ్యంగా వలంటీర్లు వారంలో మూడు రోజులు కచ్చితంగా సచివాలయానికి హాజరు కావాలని తెలిపారు. ప్రజలకు మరింత చేరువలో సేవలు అందించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శశీంద్రాణి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

## గ్రామ రెవెన్యూ కార్యవర్గం ఏర్పాటు



**సైదాపురం, డిసెంబరు 30, పభాతవార్త:** రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఆదేశాల మేరకు మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులు శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా దూర్జటి గుణశేఖర్, ఉపాధ్యక్షునిగా వల్లెపు మునిబాబు, కార్యదర్శిగా నెల్లూరు రమాదేవి, సంయుక్త కార్యదర్శిగా షేక్ హాజరతయ్య, కోశాధికారిగా కొప్పుల అరుణను గ్రామ రెవెన్యూ అధికారులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. నూతన వర్గానికి తహసీల్దారు పి.కృష్ణ, రెవెన్యూ అధికారులు అభినందనలు తెలిపారు.

## రైతులు ఈ పంట నమోదు తప్పనిసరి చేసుకోవాలి



**సైదాపురం,డిసెంబరు30,ప్రభాతవార్త:** మండలంలోని రైతులు తప్పనిసరిగా ఈ పంటనమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి హైమావతి తెలిపారు. మండల పరిధిలోని మర్లపూడి గ్రామంలో ఉన్న సచివాలయాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా హాజరు పట్టికలు, రికార్డులను తనిఖీచేసి వ్యవసాయ శాఖకు సంబంధించి పలు సూచనలు సిబ్బందికి అంద జేశారు. అనంతరం మాట్లా డుతూ ప్ర భుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు పొందాలంటే తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకో వాలని తెలిపారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అందిస్తున్న పథకా లు వారికి అందేలా చూడాలని, లేని పక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## నరేష్‌పై పిడీ యాక్ట్ నమోదు చేయాలి

**నెల్లూరు డిసెంబర్ 30, ప్రభాతవార్త-వైద్యం** అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణకు చెందిన బైరి నరేష్‌పై తెలంగాణ ప్రభుత్వం తక్షణమే పిడీ యాక్ట్ కేసును నమోదు చేయాలని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, నమామి హర గంగే రాష్ట్ర ప్రముఖ్ మిడతల.రమేష్ శుక్రవారం ఒ ప్రకటనలో డిమాండ్ చేశారు. శబరిమల అయ్యప్పస్వామి జన్మ వృత్తాంతంపై అవమానకరంగా మాట్లాడుతూ హిందూ మత విశ్వాసాన్ని, హిందువుల వారి మనోభావాలను బైరి.నరేష్ దెబ్బ తీసే విధంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వైరల్ అవుతున్న అతని వీడియోలు ఇప్పటికే అయ్యప్ప, హిందూ సంస్థల మనోభావాలు ఆందోళనకు గురి అవుతాయన్నారు. డాక్టర్ అంబేద్కర్ పేరు చెప్పి కొడంగల్ నియోజకవర్గంలో ఒ సభలో నరేష్ సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రవరిస్తున్నాడని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అతనిపై పిడి యాక్ట్ నమోదు చేసి అతనిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

## 31వ తేదీ రాత్రి నిబంధనలు పాటించాలి



**వింజమూరు,డిసెంబర్30ప్రభాతవార్త:** వింజమూరు మండల పరిధిలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని డిసెంబర్ 31వ తేదీ రాత్రి పోలీస్ నిబంధనలను పాటించి నూతన సంవత్సర వేడుకలను జరుపు కోవాలని ఎస్ఐ జంపానికుమార్ తెలిపారు. యువకులు 31వ తేదీ అత్యుత్సాహంతో రోడ్డుపై కేక్‌లు కట్‌చేయడం , ప్రజలకు ఇబ్బంది కలిగించే పనులు చేయడం, బైక్‌పై త్రిబుల్‌రైడింగ్ చేయడం నేరమని అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. డాబాలు కూడా నిర్దేశ సమయానికి మూసివేయాలని, అలా కానిచో వారిపై కూడా చర్యలు తీసుకుంటమన్నారు . కావున యువత జాగ్రత్తగా , సంతోషంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



**సైదాపురం, డిసెంబరు 30, ప్రభాతవార్త:** ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దారు పి.కృష్ణ తెలిపారు. మండల పరిధిలోని రామసాగరం గిరిజన కాలనీ నందు గ్రామ సర్పంచు ముత్తుకూరు వెంకటరత్నమ్మ అధ్య క్షతన పౌరహక్కుల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చే సిన తహసీల్దారు పి.కృష్ణ, ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్‌లు మాట్లాడుతూ ప్రజలందరికి స మాన హక్కులు ఉండాలంటే ప్రతి ఒక్కరు చదు వుకుని చట్టాలపై అవగాహన కలిగి ఉండాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దయాకర్‌రావు, ఎంపీటీసీ సభ్యులు చలపాటి నాగరాజు, వీఆర్వో సుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గాయపడిన టీడీపీ కార్యకర్తలకు ఇంఛార్జీ ఆర్థిక సాయం అందజేత



**కందుకూరు, డిసెంబరు 30, ప్రభా తవార్త** రెండు రోజుల క్రింత టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా కందుకూరులో జరిగిన దుర్ఘటనలో గాయపడ్డ ముగ్గురు పార్టీ కార్యకర్తలు ఒంగోలులో చికిత్స పొందుతున్నారు. గుడ్లూరు మండలం బసిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన చిల కల వెంకట కృష్ణారెడ్డి, కందుకూరు కార్యక్రమానికి వస్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఒంగోలులోని లక్ష్మీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం ఆసుపత్రికి వెళ్ళి కృష్ణారెడ్డిని పరామర్శించారు డాక్టర్లతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. నాగేశ్వరరావు వైద్య ఖర్చుల కోసం ఆ కుటుంబానికి లక్ష రూపాయల చెక్కును అంద జేశారు. అలాగే కందుకూరు మండలం శ్రీరంగారాజపురం గ్రామానికి చెందిన వంకదారి పిచ్చయ్య రి మ్స్ ఆపుపత్రిలో చికిత్స పొందుతుండగా పరామర్శించి రూ.20వేలు ఆర్థిక సహాయం అందించారు. గుడ్లూరు మండలం దుప్పలంపాడు గ్రామానికి చెందిన చెరుకూరి మాల్యాద్రి కూడా రిమ్స్ ఓనే చికిత్స పొం దుతుండగా నాగేశ్వరరావు అతనిని కూడా పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, పార్టీ నాయకులు నరాల మాలకొండారెడ్డి, కర్నా టి మల్లిఖార్జునరెడ్డి, గుత్తా మాలకొండయ్య, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పొడపాటి మహేష్, కందుకూరు పట్టణ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక సలాం, నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## వైసిపి పాలనలో విధ్వంస చర్యల చిత్రమాలికల ప్రదర్శన




**కావలి, డిసెంబరు 30 ప్రభాతవార్త** వైసిపి ప్రభుత్వ మూడున్నరేళ్ల పాలనలో రాష్ట్రంలో జరిగిన విధ్వంసకర చర్యల దృశ్యాల చిత్రమాలికల ఫోటోల ప్రదర్శనను కావలి బృందానం హౌసింగ్ కాలనీ కళ్యాణమండపంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. బిసి సదస్సులో పాల్గొన్న నేతలందరూ ఈ చిత్రమాలికల దృశ్యాల్ని పరిశీ లించారు. రాష్ట్రంలో జరిగిన అల్లర్లు,జర్నలిస్టుల అరెస్టులు,ఆస్తుల విధ్వంసాలు, బిసి నేతల అక్రమ అరెస్ట్‌లకు సం బంధించిన దృశ్యాల చిత్రమాలికలు అందర్ని ఆకర్షించాయి. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర నాయకత్వంలో కావలిలో జరిగిన బహిరంగ సభకు కనీవినీ ఎరుగని రీతిలో జన ప్రభంజనంతో కావలి కేక పుట్టించి చంద్రబాబు ప్రశంసల్ని అందుకున్నారు. బిసి సదస్సును కూడా వినూత్న రీతిలో నిర్వహించి ప్రత్యేకతను చాటిచెప్పారు.

## మన్నవ కుటుంబంతో చంద్రబాబు



**కావలి, డిసెంబరు 30 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర కుటుంబ సభ్యులతో శుక్రవారం బృం దావనం హౌసింగ్ కాలనీ ఆవరణలో బ స్సులో వున్న చంద్రబాబును కలిశారు. చంద్రబాబు మన్నవ కుటుంబ సభ్యుల్ని ఆప్యాయంగా పలకరించి ముచ్చటిం చారు. దీంతో మన్నవ కుటుంబం ఆనం దానికి అవధులు లేకుండాపోయింది.

## గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోండి



**మర్రిపాడు,డిసెంబర్30ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని మర్రిపాడు ఎంపిడిఓ పి.నాగమణి కోరారు . మండల పరిధిలోని డిసిపల్లి సచివాలయంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై సమీక్షా సమావేశంనిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసిపల్లి పంచాయతీ సచివాలయ పరిధిలో రెండు నెలల క్రితం మొదటిదపా సమీక్షా సమావేశాన్ని నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకున్నామన్నారు. వాటిలో ఇంతవరకు 25సమస్యలను పరిష్కరించామన్నారు. త్వరలో ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఈ సచివాలయ పరిధిలో పర్యటించే నేపథ్యంలో మండల స్థాయి అధికారులు సమన్వయం చేసుకొని మరికొన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామ వాలంటీర్లు తన క్లస్టర్ పరిధిలో గతంలో గుర్తించిన సమస్యలు కాకుండా ఇంకా ఏమైనా తమ దృష్టికి వస్తే వాటిని కూడా సచివాలయ సమస్యల నివేదికలో పొందుపరచాలని ఆమె కోరారు. ఎక్కువగా రెవెన్యూ సమస్యలు వస్తున్నాయని ఈ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం చురుకుగా పనిచేయాలని ఆమె కోరారు. గ్రామంలోని పోలీస్ స్థలాన్ని, పోలీస్ పార్క్ పేరుతో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఎంపిడిఓ దృష్టికి తెచ్చారు. ఈస్థలం కబ్జాకు గురవుతున్నందున సత్వరమే చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓను కోరారు . స్థానిక పంచాయతీ సర్పంచ్ రేవూరు సుప్రజా గోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో ఇఓపిఆర్‌డి మస్తాన్‌ఖాన్, మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ పి.సురేంద్ర, సచివాలయ కార్యదర్శి పి.మహేంద్ర, సచివాలయ సిబ్బంది , వాలంటీర్లు , స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## నరేంద్రమోడీ మాతృమూర్తి మృతికి వేమిరెడ్డి నివాళులు

**నెల్లూరు కార్పోరేషన్ డిసెంబర్ 30 ప్రభాతవార్త** ప్రధానమంత్రి నరేంద్రమోడీ మాతృమూర్తి హిరాబెన్ మృతి బాధాకరమని రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డివిచారం వ్యక్తం చేశారు. దేశం గర్వించదగ్గ బిడ్డకు జన్మనిచ్చిన హిరాబెన్ ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబసభ్యులకు మనో ధైర్యం ప్రసాదించాలని భగవంతుని ప్రార్ధిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మృతికి ఆయన నివాళులర్పించారు.

## ముంగమూరు క్రాస్ రోడ్డు వద్ద చంద్రబాబుకు అభిమానులు ఘనస్వాగతం



**బిట్రగుంట, డిసెంబరు 30 ప్రభాతవార్త** బోగోలు మండలం ముంగమూరు క్రాస్ రోడ్డు వద్ద శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆర్చి సమీపంలో మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుకు మండల పార్టీ నేత రావి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘన స్వాగతంపలికారు. కావలి పర్యటన ముగించుకొని నెల్లూరు వైపు వెళ్తున్న చంద్రబాబునాయుడుకు జెసిబితో భారీ గజమాలతో ఆయనను సత్కరించి జిందాబాద్ నినాదాలు చేశారు. వారి అభిమానానికి చంద్రబాబు అభివాదం చేస్తూ ఉత్సాహపరుస్తూ చేతులు ఊపారు. మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం.నాగేశ్వరరావు, ఎల్.సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబునాయుడుని కలిసిన దివ్యాంగుల నేతలు

**కావలి రూరల్, డిసెంబరు 30 ప్రభాతవార్త** ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి కావలి పట్టణానికి విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుని శుక్రవారం వికలాంగుల హక్కుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి, టిడిపి విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర కార్యదర్శి మండవ వెంకట్రావు ఆధ్వర్యంలో దివ్యాంగ నేతలు కలిశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట కోటేశ్వరరావు సూచనలతో చంద్రబాబుని కలిసినట్లు మండవ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో దివ్యాంగుల పట్ల చిన్నచూపు, వారిపై జరుగుతున్న అఘాత్యాలు, పెన్షన్లు తొలగింపు విషయాల్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. పెన్షన్లు పెంపుదల, తీసివేసిన రేషన్‌కార్డుల పునరుద్ధరణ, ఇంటి స్థలాలు, పక్కా ఇంటి నిర్మాణం, మోటార్ వాహనాలు ఉచితంగా అందించాలని, దివ్యాంగుల కార్పొరేషన్ ద్వారా ఎటువంటి నిబంధనలు లేకుండా ఉపాధి సౌకర్యాల కనీసం 5 లక్షలు పెట్టుబడితో కల్పించాలని, ఉచిత బీమా, దివ్యాంగుల పిల్లలకు ఉచిత విద్య, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు, చేతి కర్రలు, ట్రైసైకిళ్లు, వీల్‌చైర్‌లు, హియరింగ్ మిషన్లు, కృత్రిమ అవయవాలు ఇవ్వాలని తదితర సమస్యలపై వినతి పత్రం అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ నేతలు సోమయ్య, ఎన్.మాధవరావు, భాస్కర్, మాలకొండయ్య, నారాయణ, మహబూ బాషా, బాజీ, శంకర్, లక్ష్మి, పోలమ్మ, సుబ్రమణ్యం, గాలం మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కావలి జోన్ క్రికెట్ విన్నర్‌గా కావలి జవహర్ భారతి జట్టు



**కావలి రూరల్, డిసెంబరు 30 ప్రభాతవార్త** విక్రమ సింహపురి యూనివర్శిటీ కావలి జోన్ క్రికెట్ విన్నర్‌గా కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాల జట్టు విన్నర్‌గా నిలిచింది. కావలి జవహర్ భారతి కళాశాల స్వర్గీయ డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి(డిఆర్) క్రీడా మైదానంలో శుక్రవారం జరిగిన కావలి జోన్ క్రికెట్ ఫైనల్స్ ఉత్కంఠతగా జరిగాయి. విన్నర్స్‌గా కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాల జట్టు, రన్నర్స్‌గా కావలి ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు నిలిచారు. ఈ విద్యార్థులను జెబి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజగోపాల్ అభినందించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ క్రికెట్ ఫైనల్స్ ఎంతో ఉత్కంఠభరితంగా సాగిందని తెలిపారు. టోర్నమెంట్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరున ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. ఈ పోటీలకు యూనివర్శిటీ పరిశీలకులుగా సి.హెచ్.మణికంఠ వ్యవహరించారని తెలిపారు. క్రికెట్ కోచ్ రమణయ్యను దుశ్శాలువాతో సత్కరించారు.

## జనవరి 1న అందుబాటులో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

**ఆత్మకూరు, డిసెంబర్30 ప్రభాతవార్త:** నూతన సంవత్సరం సందర్భంగా ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి జనవరి 1వ తేదీన నెల్లూరులోని తన నివాసంలో అందుబాటులో ఉంటారని వైసిపి కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. జనవరి 2న ఉదయం 10గంటలకు చేజర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఆప్కాబ్ నిధులతో నిర్మించిన గోడౌన్లను ప్రారంభిస్తారని, 2 నుండి 4వ తేదీ వరకు మధ్యాహ్నం 3-30గంటలకు మర్రిపాడు మండలం కంపసముద్రం (కంపసముద్రం, చాబోలు) సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమాలకు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు, మీడియా మిత్రులు తప్పక హాజరు కావాలని వారు కోరారు.

## చంద్రబాబును కలిసేందుకు వచ్చిన బృందావనం వాసులు



**కావలి, డిసెంబరు 30 ప్రభాతవార్త** కావలి బృందావనం హౌసింగ్ కాలనీ ఆవరణలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బస్సులో బస చేశారు. శుక్రవారం ఉదయం చంద్రబాబునాయుడుని కలిసి సత్కరించేందుకు కావలి బృందావనం హౌసింగ్ కాలనీ వాసులు, మరి ముఖ్యంగా మహిళలు భారీగా తరలివచ్చారు. అలాగే కావలి పట్టణంలోని వ్యాపారస్తులు, ఆర్యవైశ్య యువకులు పెద్దఎత్తున తరలివచ్చారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రతో ముచ్చటించారు. చంద్రబాబునాయుడుని కలిశారు. కావలి బృందానం హౌసింగ్ కాలనీలో చంద్రబాబు బస ఏర్పాట్లు కల్పించడం తీవ్ర చర్చనీయాంశమైంది. వైసిపికి అడ్డాగా బృందావనం హౌసింగ్ కాలనీ మారిందన్న ప్రచార నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు బస ఏర్పాట్లు కల్పించడంతో రాజకీయ సంచలనం సృష్టించినట్లుయింది.

## కుల వృత్తుల వారితో చంద్రబాబు



**కావలి, డిసెంబరు 30 ప్రభాతవార్త** బడుగు, బలహీన వర్గాలకు సంబంధించిన కుల వృత్తుల వారు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి ఫోటోలు దిగి ముచ్చటించారు. ఇదేమి ఖర్మ ఈ రాష్ట్రానికి అన్న కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కావలి బృందావనం హౌసింగ్ కాలనీ కళ్యాణమండపంలో బిసి సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ కుల వృత్తులను ప్రదర్శిస్తూ ఆ కులాలకు చెందిన వారు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు స్వాగతం పలికారు. వారితో చంద్రబాబు ఫోటోలు దిగి ఆనందపరిచారు. ఈ కార్యక్రమంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## మాదాక ద్రవ్యాలపై అవగాహన



**ఉదయగిరి డిసెంబర్ 30 ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని ఎఆర్ఆర్ జూనియర్ కళాశాలలో మాదాక ద్రవ్యాలమీద సెబ్ అధికారి అడిషనల్ ఎస్‌పి ఆదేశాల మేరకు ఉదయగిరి సెబ్ అధికారిఎం రవీంద్రబాబు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు ప్రజలు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని యుక్తవయసులో మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. మాదక ద్రవ్యాల కేసులు శిక్షలు, బలంగా ఉంటాయని సమాజంలో చెడ్డపేరు తెచ్చు కోవద్దని ప్రతి ఒక్కరు మంచి అలవాట్లతో మెలగాలని కోరారు. ఈకార్యక్రమానికి ఏఆర్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిఫల్ కిరణ్ ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కళాశాలలో గ్రామా లలో మాదక ద్రవ్యాల బూతం ఎట్టి పరిస్థితులలో ప్రవేశించకూడదని అలాంటి వాటికి ప్రజలు దూరంగా ఉండాలని కోరారు. సెబ్ అధికారి ఎస్ఐ మురళీ ఈకార్యక్రమంలో పాల్గోని ప్రభుత్వం కోరినట్లు మాదక ద్రవ్యాల రహిత ఆంద్రప్రదేశ్‌గా మన ఆంధ్రప్రదేశ్‌ని నిలబెట్టాలని కోరారు. మాదక ద్రవ్యాల గురించి ఏదైనా సమాచారం ఉంటే సెబ్ టోల్ ఫ్రీనెంబర్ 14500కి కాల్ చేసి ప్రభుత్వానికి సహకరించాలని తెలిపారు.

## పింఛన్ల రద్దుపై సీపీఎం భారీ ర్యాలీ, ధర్నా




**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** పేదోళ్ల పింఛన్లు రద్దు చేయడాన్ని నిరసిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నెల్లూరు నగర, రూరల్ కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం బారాషాహీద్ దర్గా గ్రౌండ్ నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు ర్యాలీ, అనంతరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా కార్యక్రమాన్ని బాధితులతో కలిసి శుక్రవారం సీపీఎం నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో వార్డుకు 90 నుంచి 150 పింఛన్లకు పైగా, నెల్లూరు నగరంలో 5వేలకు పైగా పింఛన్లను కుంటి సాకులతో రద్దు చేశారని ఆరోపించారు. మంజూరు చేసే సందర్భంలో అన్ని రకాల విచారణ జరిపి ఇచ్చిన పింఛన్లు, సంవత్సరాల నుంచి తీసుకుంటున్న పింఛన్లను హఠాత్తుగా రద్దు చేయడం వలన లబ్దిదారులు తీవ్రమైన మానసిక క్షోభకు గురవుతున్నారని ఆవేదన చెందారు. 3వేల రూపాయల పింఛను ఇస్తానని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి మాట తప్పి సంవత్సరానికి రూ.250 చొప్పున ఇస్తూ రూ.250 పెంచినప్పుడల్లా వేల పింఛన్లు కోత విధిస్తున్నాడని విమర్శించారు. ఏ విచారణ లేకుండా యధాప్రకారం అందరికీ పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పింఛన్లు కోత విధిస్తే వైసీపీ ప్రభుత్వం ఫలితం అనుభవించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య, సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, పి.సూర్యనారాయణ, కిన్నెరకుమార్, కొండా ప్రసాద్, బీపీ నరసింహ, మూలం ప్రసాద్, కత్తి పద్మ, ఎన్.వి.సుబ్బమ్మ, కె.చెంగయ్య, షేక్ రషీద్, షేక్ ఫయాజ్, రమణ, శ్రీనివాసులు, షేక్ జాఫర్, నక్క వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల్ని కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం



**కావలి, డిసెంబరు 30 ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కుల్ని కాలరాస్తోందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమాదేవి తీవ్ర స్థాయిలో విమర్శించారు. శుక్రవారం కావలికి సిఐటియు ప్రచార యాత్ర వచ్చింది. కావలి ఓవర్ బ్రిడ్జి సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సిఐటియు రాష్ట్ర 16వ మహాసభలు జనవరి 2,3,4 తేదిలలో భీమవరంలో జరుగుతున్న సందర్భంగా ఈ నెల 28 న కుప్పంలో ప్రారంభమైన ప్రచార యాత్ర నేడు కావలి పట్టణానికి రావడం జరిగిందన్నారు. కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను మార్పు చేసిందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పు కలుగుతుందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను విచ్చలవిడిగా అంబాని, ఆదాని లాంటి బడా పారిశ్రామికవేత్తలకు తక్కువ ధరలకు అప్పగిస్తుందన్నారు. అంతేకాకుండా రైల్వే ఆస్తులను ప్రైవేటీకరిస్తుందన్నారు. రైల్వే చార్జీలతో పాటు వివిధ రకాల భారాన్ని ప్రజలపై మోపుతుందన్నారు. వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. తక్కువ జీతాలతో ఎక్కువ శ్రమ చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తుందన్నారు. ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులపై జరగబోయే రాష్ట్ర మహాసభలలో చర్చించడం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిర్దిష్టమైన పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరికలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి మన రాష్ట్ర ప్రభుత్వం వంత పాడుతూ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ప్రశ్నించకుండా మన రాష్ట్రంలో వున్న ఒకే ఒక్క దామోదరం సంజీవయ్య పేరుతో వున్న విద్యుత్ జెన్కోను ఆదానికి అప్పగించడం దారుణమన్నారు. జెన్కో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్కడ ఉద్యోగులు, కార్మికులు 345 రోజులుగా పోరాటాలు సాగిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కేంద్రం అడుగుజాడలలో రాష్ట్ర ప్రభుత్వం పయనిస్తూ ప్రజలపై మోయలేని భారం మోపుతుందన్నారు. ఈ రెండు ప్రభుత్వాలు అవలంభిస్తున్న వ్యతిరేకంగా ప్రజా,కార్మిక పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరికలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్.కె.రెహానాబేగం, పట్టణ అధ్యక్షులు ఎ.వి.కృష్ణయ్య, కార్యదర్శి వై.కృష్ణమోహన్, నాయకులు కె.జాన్, బి.కృష్ణయ్య, సిపియం నాయకులు పి.పెంచలయ్య, ఎస్.వెంకయ్య, ఎస్.కె.మస్తాన్, డివైఎఫ్ఐ నాయకులు పి.పెంచల నరసింహం, పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి నిరోధకుడు జగన్మోహన్‌రెడ్డి



**దగదర్తి, డిసెంబరు 30 ప్రభాతవార్త** అభివృద్ధి నిరోధకుడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దుయ్యబట్టారు. ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు శుక్రవారం దగదర్తి మండలంలో ఎయిర్‌పోర్టు శిలాఫలక ఆవిష్కరణ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లాను పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో 6.01.2019న విమానాశ్రయానికి తాను శంఖుస్థాపన చేశానన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పలు పరిశ్రమలు, పోర్టులను జగన్మోహన్‌రెడ్డి తన బినామీలకు ఇచ్చి ప్రజలకు అన్యాయం చేస్తున్నారన్నారు. 360 కోట్లతో విమానాశ్రయ నిర్మాణాన్ని తన హయాంలో ప్రారంభిస్తే ప్రస్తుతం ఇక్కడ కాదని వేరే చోటకు తరలించాలని కుట్రలు పన్నడాన్ని తాను ఖండిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నెల్లూరు పార్లమెంటు అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు, మాలేపాటి రవీంద్రనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## వార్త క్యాలండర్ ఆవిష్కరణ




**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** వార్త తెలుగు జాతీయ దినపత్రిక 2023 క్యాలండర్‌ను శుక్రవారం నెల్లూరు నగరపాలకసంస్థ కార్యాలయంలో కమిషనర్ డి.హరిత తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వార్త సిబ్బంది బాలు, రవికుమార్, రిపోర్టర్లు శివకుమార్, రిజవాన్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## సైకో పాలనకు త్వరలోనే అంతం





**కోవూరు, డిసెంబరు30 ప్రభాతవార్త :** అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ టిక్కెట్ ఇవ్వవద్దని చెప్పినా తానే ఆయనను బ్రతిమిలాడి టిక్కెట్ ఇప్పించి రాజకీయ భిక్ష పెడితే ఆ పార్టీకే వెన్నుపోటు పొడిచి తమపై నిత్యం విమర్శలు చేస్తున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కోవూరు నియోజకవర్గాన్ని మాఫియాల మయంగా మార్చారని టీడీపీ అధ్యక్షుడు , మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రసన్నపై నిప్పులు చెరిగారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరులోని బజారు సెంటర్‌లో శుక్రవారం రోడ్ షో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కోవూరు నియోజకవర్గం డెల్టా ప్రాంతంగా పచ్చని పంటలతో విలసిల్లేదని, ప్రస్తుతం ఈ వైసీపీ పాలనలో ఎటు చూసినా గ్రావెల్, ఇసుక, మద్యం, మట్టి మాఫియాలుగా మారిపోయాయన్నారు. ఈ ప్రభుత్వ పాలనలో దోచుకోవడమే పరమావధిగా మారిపోయిందన్నారు. ఈ అరాచక పాలన అంతం కావాలంటే కలిసి కట్టుగా పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ దుర్మార్గ పాలన అంతమొందించేందుకు ఇంటి కొకరు టీడీపీ జెండా పట్టుకుని రావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. బస్మాసురుడికి శివుడు వరం ఇచ్చినట్లుగా ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డిని అధికారం ఇచ్చారని, ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో పింఛన్ వ్యవస్థతో పాటు రూపాయికి కిలో బియ్యం ఇచ్చింది తెలుగుదేశం పార్టీ కాదా అని ప్రశ్నించారు. 75 రూపాయలు ఉన్న పింఛన్‌ను అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి 200 రూపాయలు చేస్తే, దానిని తెలుగుదేశం పార్టీ 2 వేలకు చేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి దానిని కేవలం 500 మాత్రమే పెంచాడని పేర్కొన్నారు.



పాదయాత్రలో 45 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరికీ పింఛన్ ఇస్తానని చెప్పిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే లేదన్నారు. ప్రస్తుతం వృద్ధులకు, వితంతువులకు, అవ్వాతాతలకు వస్తున్న పింఛన్లను ఏవో కుంటి సాకులు చూపించి తొలగించిన ఈ ముఖ్యమంత్రి అరాచక పాలనకు దించేందుకు ప్రజలు కలిసి కట్టుగా రావాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో అన్నా క్యాంటీన్‌లు, పెళ్లికానుక, చంద్రన్న భీమా విదేశీ విద్య వంటి పథకాలను ఏర్పాటు చేస్తే ఈ ప్రభుత్వంలో వాటన్నింటినీ తీసి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పాలనలో సమర్థవంతంగా పనిచేసిన పోలీస్ శాఖ వైసీపీ పాలనలో వారి అడుగులకు మడుగులు వత్తే విధంగా తయారయ్యారని ధ్వ.జ మెత్తారు. ఇప్పటికే అనేక మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అరాచక పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ప్రాంతీయ విభేదాలు రెచ్చగొట్టే విధంగా మూడు రాజధానుల పేరిట ఈ ముఖ్యమంత్రి మూడు ముక్కలాట ఆడుతున్నారని విమర్శించారు. తమ పాలనలో పోలవరం ప్రాజెక్టును 70 శాతం పూర్తి చేస్తే ఈ మూడు సంవత్సరాల పాలనలో ఈ ప్రభుత్వం పోలవరం ఊసే పట్టించుకోలేదన్నారు. మద్యం, ఇసుక, గ్రావెల్ మాఫియాతోనే రాష్ట్రంలో పరిపాలన సాగుతుందన్నారు. దీనికి తోడు ఉద్యోగస్తులకు 1వ తేదిన జీతాలు కూడా ఇవ్వలేని పరిస్తితుల్లో అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. జగన్‌పోవాలి బాబు రావాలి అనే పేరు చప్పగానే ప్రజల్లో పెద్ద ఎత్తున హర్షద్వానాలు వెల్లివిరిశాయి. జాబు కావాలంటే బాబు రావాలని ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సైకో ముఖ్యమంత్రి కందుకూరు మృతులకు కనీసం సంతాపం కూడా ప్రకటించలేని స్థితిలో ఈ సైకో ముఖ్యమంత్రి తయారయ్యాడన్నారు. ఒక ఎంతో తల్లి అనారోగ్యంతో ఎంతో బాధలో ఉన్న ప్రధాని నరేంద్రమోదీ కందుకూరు మృతులకు సంతాపం తెలియజేసే వెంటనే రెండు లక్షలు ఎక్స్ గ్రేసియా ప్రకటించి తన ఉదార్తను చాటుకున్నారన్నారు. తన మాతృమూర్తి మరణించినా ఆ కార్యక్రమాన్ని సాదా గా చేసి సాంప్రదాయబద్దంగా చేసి చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఈసందర్భంగా ఆమె మృతికి తన ప్రగాడసంతాపాన్ని తెలియజేస్తున్నామన్నారు. కందుకూరు మృతులకు కనీ సం సానుభూతి చూపకుండా తానేదో డ్రోన్‌తో షూటింగ్ చేసి వారి అకాల మృతికి కారణమయ్యానని ఈ దద్దమ్మ మంత్రులు విమరి ంచడం దారుణమన్నారు. ఈ సైకో పాలనకు అంతమయ్యే రోజు దగ్గర్లో ఉంద న్నారు. తెలుగుదేశం పారీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్దంగా ఉందన్నారు. పవన్‌కల్యాణ్‌ను, కమ్యునిష్టులను సైతం ఈమంత్రులు విమరి ంచడమే పరమావధిగా పెట్టుకున్నారన్నారు. పోలీసులు సైతం ఇకనైనా తమ తీరుమార్చుకోవాలని చెప్పారు. కోవూరులో వచ్చిన ఈ ప్రజాస్పందన చూసి తన హృదయం పూర్తిగా ఆనందమయమైందన్నారు. తన ఐదేళ్ల పాలనకు ఇప్పటి జగన్మోహన్‌రెడ్డి పాలనకు ఎవరు సంక్షేమపథకాలు ప్రవేశపెట్టారో ఈ సైకో ముఖ్యమంత్రి కోవూరులోని బహిరంగ చర్చకు సిద్దమా అని సవాల్ విసిరారు. రైతులకు ఇక్కడి ఎమ్మెల్యేలు, మంత్రులు తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఒక సైకో ముఖ్యమంత్రి ఉంటే కోవూరులో ఒక సైకో ఎమ్మెల్యే తయారయ్యాడన్నారు. ప్రతీ దాంట్లో ముడుపులు లేనిదే పనికావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి, ,కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి పెళ్లకూరు శ్రీనివాసు లు రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కే రామ కృష్ణ, కంభం విజయరామిరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి గూటూరు కన్నబాబు, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, మాజీ మంత్రి పరసారత్నం, ఉన్నారు.

